యువత క్రీడల్లో సత్తా చాటాలి

- బెల్టు షాపులు నిషేధాన్ని స్వాగతిస్తున్నాం
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 14 : యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మునుగోడు నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. ప్రథమ స్థానం డాకు తండా, ద్వితీయ నాంపల్లి, తృతీయ నారాయణపురం జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బెల్టు షాపులు నిషేధంపై తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకులను పట్టిస్తే రూ.2వేల నజరానా ప్రకటించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు దోనూరి జైపాల్ రెడ్డి, సర్పంచులు సుర్వి యాదయ్య, దోనూరి శేఖర్‌రెడ్డి, మన్నె చిత్రసేనరెడ్డి, సామల భాస్కర్, యాదవరెడ్డి, శ్రీనునాయక్, ఎంపీటీసీలు శివరాత్రి కవితాసాగర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకులు జక్కిడి దన్వంత్ రెడ్డి, కూసుకుంట్ల సత్తిరెడ్డి, మన్నె ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భిక్షం పాల్గొన్నారు.

నాటి ఆట పాటలకు పునరుజ్జీవనం

- గాయకుడు ఏపూరి సోమన్న
- ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 14 : స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో జిట్టా రాధమ్మ ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చివరి రోజు ఆదివారం ముగ్గుల పోటీలు, కబడ్డీ, వాలీబాల్, చెస్, గిల్లిదండ, మ్యూజికల్ చైర్స్, తొక్కుడు బిల్లా, అష్టాచెమ్మ, స్పూన్ మ్యూజికల్, క్యారమ్, పతంగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయకుడు ఏపూరి సోమన్న మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న నాటి కళలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు జిట్టా బాలకృష్ణారెడ్డి సారథ్యంలో మరోసారి పురుడుపోశారన్నారు. ఈ సందర్భంగా యువజన సంఘాల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నాటి కళలు, ఆటలు, పాటలను భావితరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. క్రీడా పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి అందరూ భాగస్వాములై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోమారి సుధాకర్‌రెడ్డి, అందె శంకర్ పాల్గొన్నారు.

పాటలు పాడుతున్న ఏపూరి సోమన్న

ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు భానుపురి

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- వైభవోపేతంగా గోదా, శ్రీనివాసుడి కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

బొడ్రాయిబజార్ : స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దంపతులు

బొడ్రాయిబజార్, జనవరి 14 : ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు భానుపురి అని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాల్లో భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, గోదాదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. విష్ణుచిత్తుడి కుమార్తె గోదాదేవితో అవతార పురుషుడు శ్రీనివాసుడి కల్యాణోత్సవాన్ని దేవాలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా జరిపించారు. కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సునీత దంపతులు హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణ వేడుకను తిలకించి పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరికి ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు కలుగాలని ఆకాంక్షించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, సుధాకర్ పీవీసీ గ్రూప్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నాగమణి దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, చకిలం రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు మొరిశెట్టి సుధారాణీశ్రీనివాస్, వెలుగు వెంకన్న సంతోషి, చింతలపాటి భరత్ మహాజన్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వేడుకలు..

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా గోదా, రంగనాయకుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో సుప్రభాత సేవ, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, విష్ణుసహస్ర నామార్చనలు చేశారు. అర్చకులు ఎదుర్కోళ్లు, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను నిర్వహించారు.

వేదమంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. పలుచోట్ల అన్నదానం చేశారు. అనంతరం కల్యాణమూర్తులను ఊరేగింపు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : స్వామి వారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

గరిడేపల్లి : పొనుగోడు వేణుగోపాల స్వామి ఆలయంలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

అర్వపల్లి : కొమ్మాలలో గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట భక్తులకు 'శ్రీలహరి' గ్రంథం

శ్రీలహరి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న యాదగిరిగుట్ట ఆలయ ఈఓ రామకృష్ణారావు

యాదగిరిగుట్ట, జనవరి 14 : ప్రాణ చైతన్యానికి ఇచ్చే పరమ పవిత్ర శ్రీవైష్ణవ స్తోత్రాలతో తేజరిల్లుతున్న శ్రీమంతమైన మంత్ర పేటిక 'శ్రీలహరి' గ్రంథాన్ని ఇకపై యాదగిరిగుట్ట క్షేత్రంలో ప్రతి శనివారం బ్రేక్ దర్శనంలో పాల్గొనే భక్తులకు ఉచితంగా అందిస్తామని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారు పురాణపండ శ్రీనివాస్ రచించి, సంకలనం చేసిన 'శ్రీలహరి' ప్రత్యేక గ్రంథాన్ని ఆదివారం భోగి సందర్భంగా ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ ఆసుపత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సమర్పణలో ప్రచురించబడిన ఈ ప్రత్యేక గ్రంథం తొలి ప్రతిని ఆలయ డీఈఓ దోర్భల భాస్కర్ శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న పురణాపండ శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మినర్వా హోటల్ గ్రూప్‌నకు చెందిన రవి, శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.

కథల పోటీల్లో మహాలక్ష్మికి ప్రథమ బహుమతి

మహాలక్ష్మి

మేళ్లచెర్వు, జనవరి 14 : గడుగ్గాయి సంక్రాంతి-2024 కథల పోటీల్లో మేళ్లచెర్వు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మాడుగుల మహాలక్ష్మి రాసిన 'ఆకుపచ్చని ఆలోచన' కథకు ప్రథమ బహుమతి లభించింది. స్రవంతి, మేఘన, శృతి, గణేశ్ ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులకు హెచ్ఎం నారపరెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి

గరిడేపల్లి, జనవరి 14 : కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని రాయినిగూడేనికి చెందిన తనను నియమించి ఈ మేరకు నియామకపత్రాన్ని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నట్లు కుక్కడపు యాదగిరిగౌడ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

నాగారం, జనవరి 14 : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు గాయపడ్డ ఘటన మండలంలోని ఈటూరు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన మొగుళ్ల అంజయ్య రోజువారీగా ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో చెట్టు పైనుంచి కిందపడ్డాడు. చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకవీడు, జనవరి 14 : పీఆర్‌టీయూ నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం పాలకవీడు మండల శాఖ అధ్యక్షుడు కొణతం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీపీ భూక్యా గోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేరేడుచర్ల మండలాధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, బెట్టెతండా సర్పంచ్ మాలోతు మోతీలాల్, కాంగ్రెస్ నాయకుడు జితేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు ధర్మారావు, శేఖర్, బాలకృష్ణ, యూసుఫ్, శ్రీనివాస్, ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక కైట్ ఫెస్టివల్

బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

కోదాడటౌన్, జనవరి 14 : సంప్రదాయాలకు ప్రతీక కైట్ ఫెస్టివల్ అని ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. ఆదివారం పట్టణంలో వాసవీ క్లబ్ కోదాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కైట్ ఫెస్టివల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవలో ముందుండే వాసవీ యూత్ క్లబ్ కైట్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గిఫ్ట్ ఓచర్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వంగవీటి గురుమూర్తి, విశ్వజ్ఞాచారి, ఏడుకొండల్, ఉపేందర్, ప్రభాకర్, అనంత చక్రవర్తి, డాక్టర్ వంగవీటి భరత్‌చంద్ర, గీత, శ్రీనివాసరావు, లక్ష్మీనర్సయ్య, ప్రసాద్, రమేశ్, రాజశేఖర్, వెంకటనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

నాగారం : అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

నాగారం, జనవరి 14 : అయోధ్యలో జనవరి 22న జరిగే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న తలంబ్రాలు ఇటీవలే ఫణిగిరి రామాలయానికి చేరాయి. తలంబ్రాలకు ఈటూరు, పేరబోయినగూడెం భక్తాంజనేయ స్వామి, రామాలయంలో నిత్య పూజలు నిర్వహించారు. ధర్మ జాగరన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

మద్దిరాల : అయోధ్య రాముడి అక్షింతలను మండల కేంద్రంతో పాటు చందుపట్ల, గుమ్మడవెల్లి, గోరెంట్ల, చందుపట్ల గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. శ్రీరాముడి చిత్రపటం, నివేదన పత్రాన్ని అందజేశారు.

మత్స్య సహకార సంఘం డైరెక్టర్లకు అభినందనలు

బీఆర్ఎస్ డైరెక్టర్లను అభినందిస్తున్న రామారావు

కోదాడ రూరల్, జనవరి14 : పట్టణ పరిధి కొమరబండ మత్స్యసహకార సంఘం ఎన్నికలో గెలుపొందిన బీఆర్ఎస్ డైరెక్టర్లకు బీఆర్ఎస్ నాయకుడు మామిడి రామారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు చేసిన ద్రోహంతో చైర్మన్ పదవి దక్కలేదన్నారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదాడ పట్టణ పండ్ల వ్యాపారస్తుల కమిటీ

కోదాడటౌన్, జనవరి 14 : కోదాడ పట్టణ పండ్ల వ్యాపారస్తుల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ షమీఉల్లా, గౌరవాధ్యక్షుడిగా షేక్ బషీర్, గౌరవ సలహాదారులుగా సీహెచ్ కొండల్‌రెడ్డి, షేక్ ఖాజాభాయ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇస్మాయిల్, కోశాధికారిగా షేక్ సుభాని, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిలాని, సలీం, ఇమామ్ సాహెబ్, నాగుల్, ఎల్లయ్య, సొందు, నరసింహారావు, శ్రీను పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక, జడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్

కొత్తగూడెంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

అర్వపల్లి, జనవరి 14 : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సొంత ఖర్చులు రూ.2 లక్షలతో మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఎంపీపీ మన్నె రేణుకా లక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగంపల్లి రవీందర్, ఉప సర్పంచ్ వాక సుధాకర్, వెంకటనర్సు, రాజు, వేణు, మురళి, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

సూర్య దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సూర్య దేవాలయంలో మహా సౌరహోమం

అర్వపల్లి, జనవరి 14 : మండలంలోని తిమ్మాపురంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామికి అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం యజ్ఞశాలలో మహా సౌర హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వెంకన్నకు నియామక పత్రం అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మణ్

ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకన్న

చివ్వెంల, జనవరి 14 : ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఉండ్రుగొండకు చెందిన పల్లేటి వెంకన్న నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లేటి లక్ష్మణ్‌మాదిగ వెంకన్నకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉండ్రుగొండలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉండ్రుగొండ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పల్లేటి సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకు జానయ్యమాదిగ, మామిడి యల్లయ్యమాదిగ, పల్లేటి సైదులు, కార్తీక్, హుస్సేన్, ప్రణయ్, గోవర్ధన్, మహేశ్, మురళి, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో రోడ్డుపై తిరుగుతున్న కోతుల గుంపు

కోతుల బెడదతో జనం బెంబేలు

- తిరుమలగిరిలో వానరాల స్వైర విహారం
- ఇండ్లలో చొరబడి దాడులు
- పంటలను నాశనం చేస్తున్న వైనం
- కోతుల బెడద నివారించాలని మండల ప్రజల వినతి

తిరుమలగిరి, జనవరి 14 : తిరుమలగిరిలో కోతుల బెడదతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలోని వీధుల్లో, ప్రధాన రహదారులపై, పంట పొలాల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇండ్లలో చొరబడి తినుబండారాలను, ఇతర సామగ్రిని చిందరవందర చేసి చేతికి అందినవి ఎత్తుకుపోతున్నాయి. కోతులను బయటకు తరిమేందుకు ప్రయత్నిస్తే దాడికి పాల్పడుతున్నాయి. వానర మూకల కారణంగా రైతులు వేరుశనగ, కంది, కూరగాయల పంటలు సాగు చేయాలంటేనే జంకుతున్నారు. ఇటీవల కోతులు దాడి చేయడంతో పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్లుపై కోతులను ఢీకొని వాహనదారులు కిందపడి గాయపడిన ఘటనలు ఉన్నాయి. చిరు వ్యాపారులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర భయాందోళనలో ఉంటున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.